క్లుప్తంగా

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాయీబ్రాహ్మణ, పద్మశాలీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆదివారం శంకుస్థాపన చేసారు. రెండు కమ్యూనిటీ భవనాలకు రూ.8లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు. అనంతరం పట్టణంలోని పలు వినాయక మండలాలను సందర్శించి ఆదిదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు.

నిరాహార దీక్ష, ధర్నా జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట 27న జరిగే ధర్నా, నిరాహార దీక్షను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు వేల్పుల కుమారస్వామి, ఉల్లి మొగిలి కోరారు. ఆదివారం స్థానిక శ్రామికభవన్‌లో కాంట్రాక్టు కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సింగరేణిలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, గతేడాది సెప్టెంబర్ 26 సమ్మె సందర్భంగా ఒప్పందం అయిన అంశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మీనారాయణ, రామయ్య, వేణు, రవి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

ముత్తారం: మండలంలోని ఓడేడ్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముత్తారంలో సోమవారం ప్రారంభించే ప్రజా ఆశీర్వాదయాత్ర విజయవంతం చేయడానికి ఓడేడ్‌లో పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇంటిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యారు. రెండు వర్గాలుగా ఉన్న నాయకులను ఏకం చేసి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్న పుట్ట మధు సూచన మేరకు సమావేశం నిర్వహించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ముత్తారంలో ప్రారంభమయ్యే ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలతఅశోక్, ఓడేడ్ సర్పంచ్ సిరికొండ బక్కారావు, ఉపసర్పంచ్ దేవునూరి బానుకుమార్, మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్, మండల సర్పంచుల కన్వీనర్ నూనె కుమార్, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, పీఎసీఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

జూలపల్లి: పెద్దపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కాచాపూర్‌లో మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షల క్యాంపు నిర్వహించారు. 104 మందికి డయాబెటిక్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాదుల వెంకటేశర్లు, సెక్రటరీ లయన్ వేల్పుల రమేశ్, ఉపాధ్యక్షుడు లయన్ మీసాల సత్యనారాయణ, లయన్ మట్ట రాంరెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా మహేందర్‌రెడ్డి

రామగిరి: రామగిరి మండల ట్రాన్స్‌కో నూతన ఏఈగా మహేందర్‌రెడ్డి నియామకమయ్యారు. గతంలో పనిచేసిన రాజు సెలవుపై వెళ్లగా ఆయన స్థానంలో మహేందర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

ఆలయానికి విరాళం

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన సుంక పావని–వేణు దంపతులు పూసాలలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి రూ.5016 విరాళం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట రంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.



సుల్తానాబాద్: 107 రకాల నైవేద్యాలు



ముత్తారం: కేశనపల్లిలో కుంకుమ పూజ

నైవేద్యాలు.. అన్నదానాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా కొలువైన గణనాథులకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు. వినాయక మండపాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రామగుండం: శ్రీవిఘ్నేశ్వర మిత్రమండలి మండపంలో..



గోదావరిఖనిటౌన్: అన్నదానంలో మక్కాన్‌సింగ్



కాల్వశ్రీరాంపూర్: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



రామగిరి: కల్వచర్లలో..



జూలపల్లి: మండల కేంద్రంలో..



ఎలిగేడు మండలంలో అన్నదానం..



పెద్దపల్లిరూరల్: పెద్దబొంకూర్‌లో..

ధ్వంసమైన రోడ్డు.. బస్సు బందు

- ఇసుక లారీలతో గుంతలుగా మారిన మంథని–ఖమ్మంపల్లి రహదారి
- ఇబ్బందుల్లో విద్యార్థులు, ప్రయాణికులు



ఇసుక లారీలతో ధ్వంసమైన రోడ్డు

ముత్తారం: ఇసుక లారీల ఓవర్ లోడ్ తాకిడికి రోడ్డు ధ్వంసమైంది. దీంతో ఆర్టీసీ బస్సు నిలిపివేశారు. ఇది విద్యార్థికి, జనానికి శాపంగా మారింది. మంథని నుంచి ఖమ్మంపల్లి మీదుగా జయశంకర్ భూపాలపల్లి తాడిచెర్లకు వెళ్లే ఆర్టీసీ బస్సును రోడ్డు బాగా లేదని వారంరోజుల నుంచి ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు. మంథని ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో ముత్తారం, మంథని మండలంలోని ఖమ్మంపల్లి, సీతంపల్లి, ఇప్పలపల్లి, ధర్మారం, గోపాలపూర్, బిట్టుపల్లి, రచ్చపల్లి, ఎగ్లాస్‌పూర్, జయశంకర్ జిల్లా మల్హర్ మండలం తాడిచెర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు, ప్రజలు రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. బస్‌పాస్‌లు ఉన్న విద్యార్థులు కొందరు కాలేజీలకు వెళ్లడం లేదని స్థానికులు తెలిపారు.

ఇసుక లారీలతో రోడ్డు ధ్వంసం..

మంథని నుంచి ఖమ్మంపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇసుక లారీలతో ప్రయాణమే ప్రాణసంకటంగా మారినా.. కనీస మరమ్మతు చేసేవారే కరువయ్యారు. మానేరు ఇసుక క్వారీల నుంచి రోజుకు వందలాది లారీలు అధిక లోడ్‌తో వెళ్లడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఖమ్మంపల్లి నుంచి మంథని వరకు అడుగడుగునా గుంతలు పడటంతో ప్రయివేట్ వాహనాదారులు తిప్పలు పడుతున్నారు. ఆర్టీసీ రూట్ అధికారులు సర్వే చేసి ఈ రోడ్డుపై నడిపిన ఆర్టీసీ బస్సుకు భవిష్యత్ ఉండదని ఇచ్చిన నివేదిక మేరకు డిపో డీఎం బస్సును నిలిపివేశారు. గుంతలుగా మారిన రోడ్డుపై తట్టెడు మట్టి పోసే వారు లేక ఈ ప్రాంత ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

లారీలతో రోడ్డు ధ్వంసం



ఖమ్మంపల్లి నుంచి మంథనికి వెళ్లే రోడ్డు ఇసుక లారీలతో ధ్వంసమైంది. వారంరోజుల నుంచి ఆర్టీసీ బస్సు రావడం లేదు. రోడ్డు ఇలా ఉంటే బస్సులు నడిచేది ఎలా అని సంబంధిత అధికారులు బస్సును నిలిపి వేశారు. బస్సు నడువలేని దుస్థితిలో ఉన్నా.. గుంతల రోడ్డుకు కనీసం తట్టెడు మొరం పోసేవారు లేకనే బస్సును బందు పెట్టారు. రోడ్డుకు మరమ్మతు చేపట్టి బస్సును నడిపించాలి.

– జగారి రాజు, ఖమ్మంపల్లి స్థానికుడు

బస్‌పాస్‌లు వృథా



మంథని వెళ్లే ఆర్టీసీ బస్సు నిలిపివేయడంతో విద్యార్థులం ఇబ్బంది పడుతున్నాం. ఈ ప్రాంతం నుంచి దాదాపు 30మందికి పైగా విద్యార్థులు ఉంటాం. కొందరికి బస్‌పాస్‌లు ఉన్నాయి. వారం రోజుల నుంచి బస్సు రాకపోవడంతో ప్రయివేట్ వాహనాలలో వెళ్లడంతో చార్జీలు అధికం అవుతున్నాయి. బస్‌పాస్‌లు వృథా అయ్యాయి. కొందరు కాలేజీకి రావడం లేదు. రోడ్డు ధ్వంసానికి కారణమైన ఇసుక లారీలు మాకు శాపంగా మారాయి.

– ఇంటర్ విద్యార్థి , ప్రేమ్‌కుమార్

మరమ్మతు చేస్తే నడిపిస్తాం



మంథని నుంచి ఖమ్మంపల్లికి బస్సు నడువలేని స్థితిలో రోడ్డు ధ్వంసం కావడంతోనే నిలిపివేశాం. ఆ ప్రాంత విద్యార్థులు, జనాలు ఇబ్బందులు పడుతున్నారని మా దృష్టికి వచ్చింది. గుంతలు పడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు బాగా లేక ఖమ్మంపల్లి మీదుగా తాడిచెర్లకు వెళ్లే బస్సును నాగులమ్మ మీదుగా తక్కువ ఆదాయనికి నడిపిస్తున్నాం. రోడ్డు మరమ్మతు చేపడితే బస్సు నడిపిస్తాం.

– రాజశేఖర్, డీఎం, మంథని డిపో

నిరుపేదకు నల్ల ఫౌండేషన్ ఆపన్నహస్తం



మహేశ్‌ను పరామర్శిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన నిరుపేద ఇరుగురాల మహేశ్ కొన్నిరోజులుగా మెదడులో రక్తం గడ్డకట్టి ఫిట్స్ వస్తూ ప్రాణాపాయస్థితిలో ఉన్నాడు. స్థానిక ఎంపీటీసీ నల్లఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించి మహేశ్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మనోహర్‌రెడ్డి దాదాపు రూ.70వేల మెడికల్ బిల్లులు భరించారు. హాస్పిటల్ సదుపాయాలను డాక్టర్ రమేశ్ భరించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. బాధిత కుటుంబ సభ్యులు నల్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ రమేశ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతులు తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్



పెద్దపల్లిరూరల్: పట్టణానికి చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే విజయరమణారావుకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

కరాటే అసోసియేషన్ కార్యవర్గం



పెద్దపల్లిరూరల్: కరాటే అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఖరారు చేశారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా కొయ్యడ మొండయ్య, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనర్సయ్య, సారయ్య, ప్రధాన కార్యదర్శిగా కావేటి సమ్మయ్య, సంయుక్త కార్యదర్శిగా జంపనేస్, కనకేశ్, కోశాధికారి అరవింద్, సలహాదారు యాదగిరి, కార్యనిర్వాహణ కార్యదర్శి వెంకటేశ్, రమేశ్, ప్రసాద్ ఎన్నికయ్యారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

కాల్వశ్రీరాంపూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని మల్యాలలో ఆదివారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. వీధుల్లో పిచ్చి మొక్కలు తొలగించారు. డ్రైనేజీలు శుభ్రం చేశారు. ఎంపీడీవో రామ్మోహన్ చారి, ఎంపీవో గోవర్ధన్, సర్పంచ్ లంక రాజేశ్వరి, ఎంపీటీసీ గడ్డం రాంచంద్రం, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కామిడి సంధ్య, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ జక్కె రవి, సిటీ కేబుల్ ఎండీ మామిడాల చంద్రమౌళి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ బూషి సదాశివరెడ్డి పాల్గొన్నారు.

దండోరా సంఘానికి డప్పులు, టీషర్టులు



డప్పులు అందజేస్తున్న మక్కాన్‌సింగ్

పాలకుర్తి: బసంత్‌నగర్‌కు చెందిన మాదిగ దండోరా సంఘం సభ్యులకు ఆదివారం డప్పులు, టీషర్టులు అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు తువ్వ సతీశ్‌యాదవ్ తన సొంత ఖర్చులతో 12 మంది దండోరా సంఘం సభ్యులకు డప్పులు, టీషర్టులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చేతుల మీదుగా అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, నాయకులు పర్శవేని శ్రీనివాస్, పాత రవీందర్, గద్దల మహేందర్, కన్నం సంపత్, కొలిపాక మొగిళి, పర్వతాలు, మామిడి ఎల్లయ్య పాల్గొన్నారు.

రహదారి ఇలా.. వెళ్లేదెలా?



నాలుగు మండలాలకు వెళ్లే రహదారి దుస్థితి

- మరో రెండు రోజుల్లో నిమజ్జనం
- రహదారి పునరుద్ధరణపై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం

రామగుండం: ఈనెల 27న గణేశ్ నిమజ్జనం జరగనుంది. రామగుండం పట్టణం, అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి, ఐటీసీఎల్, ఇందిరమ్మకాలనీతో పాటు బసంత్‌నగర్ తదితర కాలనీల నుంచి సుమారు వంద విగ్రహాలను అంతర్గాం సమీపంలోని గోదావరినదిలో నిమజ్జనం చేసేందుకు రామగుండం పట్టణం మీదుగా వెళ్తారు. ఎస్టీ కాలనీ సమీపంలోని ముస్లిం కబ్రస్తాన్ వద్ద రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరి గుంతలుగా మారింది. ఒక్కరోజు వర్షం కురిస్తే వాహనాల రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. పెద్దంపేట గ్రామం మీదుగా వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించడమే కాకుండా రైల్వేగేటు అడ్డంకిగా ఉంది. గేటు వేసి ఉంటే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ప్రతి ఏటా గణపతి నిమజ్జనోత్సం వేడుకల సమయంలో తాత్కాలికంగా గుంతల్లో మట్టి పోసి చదును చేసి రహదారి పునరుద్ధరణ పనులు చేపడతారు. కాగా మరో రెండు రోజుల వ్యవధి మాత్రమే ఉండడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

స్వచ్ఛతలో భాగస్వాములవ్వాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సుల్తానాబాద్: స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీతగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని 9వ వార్డులో కౌన్సిలర్ గొట్టం లక్ష్మితో కలిసి స్వచ్ఛతాహీ సండే కార్యక్రమం నిర్వహించి, కాలనీలను పరిశీలించారు. రోడ్లపై చెత్త చెదారం వేయకుండా విధిగా మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు అందించి సహకరించాలని కోరారు. కాలనీల్లో చెత్త పేరుకుపోతే వాతావరణం కలుషితమై పలు రకాల రుగ్మతలు దరి చేరుతాయని, ప్రతి ఒక్కరూ తమ పరిధిలో పరిశుభ్రంగా ఉంచుకుంటే తద్వారా కాలనీ పూర్తిగా పరిశుభ్రంగా ఉండి ఎలాంటి రుగ్మతలు దరిచేరవని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ టి.మల్లికార్జున్ మున్సిపల్ మేనేజర్ అలీముద్దీన్, గొట్టం మహేశ్ పాల్గొన్నారు.

మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

గోదావరిఖని: బీసీ, ఓబీసీ, ముస్లిం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం తెలంగాణ లేబర్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్, నాయకులు అల్లపు తిరుపతి, అఖిల్‌వర్మ, చెరుకు పైడి, బాజా వెంకటేశ్, కన్నం భానుచందర్, జక్కం కవిత, పొన్నం రజిత పాల్గొన్నారు.

సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా తిరుపతినాయక్

ధర్మారం: సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా మండలంలోని కమ్మరిఖాన్‌పేట తండాకి చెందిన లావుడ్య తిరుపతినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మారంలో ఆదివారం సేవాలాల్ సేన సభ్యులు సమావేశమై మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అజ్మీర జితేందర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాజ్యానాయక్, సంయుక్త కార్యదర్శిగా భూక్య అంజయ్యనాయక్, కోశాధికారిగా సంతోష్‌నాయక్, మండల సలహాదారుడిగా రాజేశ్‌నాయక్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతినాయక్ హాజరై కమిటీని ఆమోదించారు.

వెంకట్రావుపల్లెలో ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీమాన్‌రావు

జూలపల్లి: పుట్టి పెరిగిన గ్రామంలో పేదలకు వైద్యం అందిస్తూ పెరిగిన గ్రామ రుణం తీర్చుకుంటున్నాడు వైద్యుడు దుగ్యాల శ్రీమాన్‌రావు. మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన శ్రీమాన్‌రావు జిల్లా కేంద్రంలో హాస్పిటల్ నెలకొల్పి వైద్యసేవలు అందిస్తున్నారు. తాను పుట్టి పెరిగిన గ్రామ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఉచిత పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నారు. సర్పంచ్ రేచవేని రాధ, ఒల్లె తిరుపతి, భుజేందర్‌రావు, వినోద్‌రావు, వెంకట్‌రావు,రాజేశ్వర్‌రావు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మాటలు నమ్మొద్దు



ప్రచారంలో దాసరి ఉష

కాల్వశ్రీరాంపూర్: సంక్షేమ పథకాల పేరు చెప్పి బడుగులను మోసం చేసేందుకు కుట్రకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మాటలు నమ్మి మోసపోవద్దని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష హితవుపలికారు. మండలంలోని గంగారం, ఊశన్నపల్లె, పందిల్ల గ్రామాల్లో ఆదివారం మన ఊరు–మన ఉషక్క కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఎస్పీ పార్టీకి ఓటువేసి గెలిపించాలని ఆమె కోరారు. జిల్లా నాయకులు రియాజ్, మండల ఇన్‌చార్జి కుమ్మరికుంట రవికుమార్, నాయకులు కిరణ్, రాము, శారద, సంపత్, శ్రీకాంత్, శ్రీలత, సుమలత పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గ పరిస్థితిపై ఆరా

రామగిరి: ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకట రమణారెడ్డికి ప్రగతి భవన్ నుంచి పిలుపు రావడంతో హుటాహుటిన హైదారాబాద్‌కు వెళ్లి మంత్రి కేటీఆర్‌ను కలిశారు. మంథని నియోజకవర్గ పరిస్థితిపై ఆరా తీసి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలని తెలిపారు. ఉద్యమకారులకు బీఆర్ఎస్‌లో సముచిత స్థానం కల్పిస్తామని, ఉద్యమకారులను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారని వెంకట రమణారెడ్డి తెలిపారు.